# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం 20 మే, 2026 | పేజీలు : 08


## కొనుగోలు కేంద్రం అధికారులపై కలెక్టర్ సీరియస్


2





# రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

### కాంట అయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ అందజేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి/గణపురం :** ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడిన, రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌లతో కలిసి గణపురంలోని జానకి రామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం దిగుమతి జరుగుతున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తయ్యిన వెంటనే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ట్రక్ షీట్‌లు ఇవ్వకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ముంచరాదని, ఇటువంటి చర్యల వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని స్పష్టం తరువాయి 2లో...

## కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వేలేరు :** చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలోని ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ఏవిధంగా జరుగుతున్నాయి, ధాన్యం రవాణాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను, కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దీంతో కొనుగోలు కేంద్రానికి అలాట్ అయిన మిల్లు యాజమాన్యం మాత్రం మిల్లులో కాలి లేదని ధాన్యం తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఇంకా 50శాతం ధాన్యం ఉందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకి ఫోన్ చేసి రాజవరం కొనుగోలు కేంద్రంలోని పరిస్థితిని వివరించారు. రాజవరం కొనుగోలు కేంద్రంతో పాటు చాలా కొనుగోలు కేంద్రాలలో మిల్లర్లతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కావున వెంటనే మిల్లుల రిట్యాగింగ్ చేయాలని సూచించారు. దీంతో వీలైనంత తొందరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ గత వర్షాకాలం పంట గోదాములలో నిల్వ ఉండడం వల్ల స్థలం లేక కొంత ఇబ్బంది ఏర్పడుతుందని దీనిని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మక్కల కొనుగోలులో సమస్యలు తొలిగి పోయాయని 2,3 రోజుల్లో ధాన్యం కొనుగోళ్ళ సమస్యలు కూడా పరిష్కారం అవుతాయాని హామీ ఇచ్చారు. రైతులు తొందరగా ప్రయివేట్ దళారుల వద్ద ధాన్యం అమ్ముకొని నష్టపోకూడదని సూచించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


6

### ధాన్యానికి నిప్పు పెట్టి
## రైతుల ఆందోళన


2

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/బెజ్జంకి :** అప్పుల బాధతో రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చీలాపూర్ పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొంటి బాలయ్య (50) వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లి గొంటి నర్సవ్వ కాన్సర్ భారిన పడటంతో ఆసుపత్రిలో తరువాయి 2లో

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

చికిత్స చేయించిన ఫలితం లేకుండా పోయింది. ఆసుపత్రిలో చికిత్సకు అయిన ఖర్చు పది లక్షలతో పాటు వ్యవసాయం పెట్టుబడి కోసం చేసిన అప్పు కావడంతో సరియైన పంట దిగుబడి రాకపోవడంతో అప్పు ఎలా తీర్చాలని గత కొన్ని రోజులుగా భాధపడుతూ మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకోని మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె సంతానం మృతుడి భార్య గౌంటి అంజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఒదయ్య తెలిపారు.

## రైతు కోసం ఖాకీ

### ఏసిపి ప్రశాంత్ రెడ్డి సేవలకు ప్రజల సెల్యూట్

**ప్రజాపక్షం/నెక్కొండ :** ఉద్యోగం పోలీసుదైనా.. హృదయం మాత్రం రైతుదే.. చట్టాన్ని కాపాడే బాధ్యతల మధ్యలోనూ రైతు పొలాన్ని, పంటను, పర్యావరణాన్ని కాపాడాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న పోలీస్ అధికారి ఏసిపి ప్రశాంత్ రెడ్డి ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక చర్చనీయాంశంగా మారారు. సాధారణంగా పోలీస్ శాఖ అంటే నేర నియంత్రణ, భద్రత పరిరక్షణ మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ సమాజ సమస్యలను తన బాధ్యతగా భావించిన ఏసిపి ప్రశాంత్ రెడ్డి రైతుల పంటల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు.. వికలాంగుల భద్రత వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తే వినూత్న సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆయన రూపొందిస్తున్న అవగాహన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా రైతులకు నష్టం కలిగించే కాకి చుక్క సమస్యపై ఆయన ఇచ్చిన సూచనలు రైతుల్లో కొత్త ధైర్యాన్ని నింపుతున్నాయి. పంటలను రక్షించుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సరళమైన భాషలో వివరిస్తూ గ్రామీణ ప్రజలకు దగ్గరవుతున్నారు. పోలీస్ అధికారిగా మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా పనిచేయాలన్న భావనతో ఆయన చేస్తున్న సేవలను చూసి రైతులు, యువత, సామాజిక కార్యకర్తలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి అధికారులు ప్రతి శాఖలో ఉంటే గ్రామీణ సమాజం మరింత బలపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రస్తుతం ఏసిపి ప్రశాంత్ రెడ్డి వీడియోలే ప్రధాన చర్చగా మారాయి. రైతుల పట్ల ఆయన చూపుతున్న మమకారం, పర్యావరణంపై వ్యకత చేస్తున్న బాధ్యతాభావం, ప్రజలకు చేరువవుతున్న తీరు పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకొస్తోందని ప్రజలు అంటున్నారు. రైతు కోసం ఖాకీ వంగితే.. సమాజం గర్వపడుతుంది అలాంటి సేవా మూర్తులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యతగా రాసిన అవసరం ప్రజలు పేర్కొంటున్నారు.



# రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమని, అన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వడం తప్పనిసరి చేయాలని, దీనిపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. జిల్లాలో 90 శాతం మక్కలు కొనుగోలు పూర్తి అయ్యిందని తెలిపారు. చిట్యాల మండలం తిరుమలాపూర్‌లో మక్కలు రవాణా చేసేందుకు వెంటనే వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాలు వస్తే రైతులు ఇబ్బందులు పడతారని కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి తనిఖీల్లో కాంటా పూర్తికాగానే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి నిప్పు పెట్టి రైతుల ఆందోళన

### కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచుల మాయం

### మొక్కజొన్న రైతులను పీడిస్తున్న నిర్వాహకులు

**ప్రజాపక్షం/నర్సింహులపేట :** మండలంలోని వస్రం తండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల పండించిన పంటకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని గత నెలలో పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తరలించారు. ఇప్పటి వరకు కాంటాలు నిర్వహించకుండా నిర్వాహకులు తమతో చెలగాటం ఆడుతున్నారని కాసులకు కక్కుర్తి పడి, రాజకీయ పలుకుబడి ఉన్న రైతుల ధాన్యానికి కాంటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్నీ సంచులు మాయం కావడం పట్ల రైతులలో తీవ్ర నిరాశ నెలకుంది. దీంతో ఇక ఎప్పటికి తమ ధాన్యం కాంటాలు జరుగవని ఆందోళన చెందిన రైతులు ఒక్కసారిగా తమ ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గోడును పట్టించుకోవాలని రైతులు కంటతడి పెట్టారు. ఇదిలా ఉండగా నర్సింహులపేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న రైతులను సెంటర్ నిర్వాహకులు డబ్బుల కోసం పీడిస్తున్నారన్నారు. ఒక్కొ రైతు వద్ద నుండి 1000 నుండి 2000 వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని గతిలేక ఇవ్వక తప్పడం లేదని ఓరైతు తన ఆవేదనను వ్యక్తం చేస్తు కన్నీరుమున్నీరయ్యాడు. డబ్బులు ముట్టజెప్పిన పెద్ద రైతుల మక్కలు త్వరగా కాంటాలు నిర్వహించి లోడింగ్ కుడా చేస్తున్నారని రైతుల ఆరోపించారు.

# కొనుగోలు కేంద్రం అధికారులపై కలెక్టర్ సీరియస్

### రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం పట్ల అసహనం విధుల నుండి తొలగించాలని ఆదేశం

**ప్రజాపక్షం/నర్సింహులపేట :** మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ సీరియస్ అయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని వరి, మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా తదితర అంశాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గతంలో హెచ్చరించిన కొన్ని చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నామని, రవాణా చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వాహనాలు, హమాలీలను అధికంగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో వేగంగా ముందుకు సాగాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారులు రైతుల ధాన్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నరని రికార్డుల నిర్వహణ సరిగా లేదని తేల్చిచెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం, కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గన్నీ సంచులు పంపిణీలో నిర్లక్ష్యంగా ఉన్నరని వెంటనే సీఈవో, వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ నర్సింహారావు, తహసిల్దార్ రమేష్‌బాబు, ఎంపీవో కెన్నెర యాకయ్య ఎవో వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పొలాల్లో వరి గడ్డి తగలబెట్టడం వల్ల భారీ నష్టాలు

### పసర ఎస్ఐ తాజుద్దీన్



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** పంట పొలాల్లో వరి కోత పూర్తయిన అనంతరం మిగిలిపోయిన వరి గడ్డిని తగలబెట్టడంతో అనేక నష్టాలు సంభవిస్తాయని పసర ఎస్ఐ తాజుద్దీన్ అన్నారు. మండలంలో మంగళవారం పలువురి రైతుల పంట పొలాలను సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ పంట పొలంలో వరి గడ్డి తగల పెట్టడంతో జరిగే ప్రమాదాలు రైతులకు ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా కనిపిస్తున్నది అని అన్నారు. ఈ చర్య వల్ల పర్యావరణానికి భూమి సారానికి ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం జరుగుతోందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అని వరి గడ్డిని కాల్చి వేయడం వల్ల భూమిలో ఉండే సహజ సేంద్రియ పదార్థాలు సూక్ష్మ జీవులు నశించి నేల సారం తగ్గిపోతుంది. దింతో తదుపరి పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు అదేవిధంగా పొలాల్లో ఉండే పురుగులకు మేలు చేసే జీవులు కూడా అగ్నికి ఆహుతి అవుతాయిని గడ్డి తగలబెట్టడం వల్ల భారీగా పొగ వ్యాపించి వాయి కాలుష్యం పెరుగుతుంది ఈ పొగ కారణంగా శ్వాస కోస సమస్యలు కంటి మండుట అలర్జీ వంటి ఆరోగ్య సమస్యలు ప్రజల్లో పెరుగుతున్నాయిని వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే అగ్ని అదుపు తప్పి సమీపంలోని ఇతర పంట పొలాలు చెట్లు విద్యుత్ తీగలు దగ్ధమయ్యే ప్రమాదం కూడా ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రోడ్లపై పొగ కమ్ముకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశమూ ఉంటుందని వరి గడ్డిని కాల్చివేయకుండా పశువుల మేతగా సేంద్రియ ఎరువుల తయారీలో బయో కంపోస్ట్ కోస వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. అని ప్రతి రైతు అధికారుల సూచనలు సలహాలు తీసుకుని పాటించాలి అని అన్నారు.

**ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు**

ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాప్‌ల బంద్‌కు సహకరించాలి



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మే20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న మెడికల్ షాప్‌ల బంద్‌కు అధికారులు,ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసిల్దార్ స్వరూప రాణి, ఎస్ఐ అమూల్యలను కలిసి బంద్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్ల పేరుతో చిన్న మెడికల్ షాప్‌ల వ్యాపారాలను దెబ్బతీయకుండా చర్యలు తీసుకోవాలని, నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బందును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీఎస్ఆర్ నిబంధనలను సైతం ఉపసంహరించుకోవాలని వారు కోరారు. మే 20న మండలంలోని అన్ని మెడికల్ షాప్‌లు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తాయని పేర్కొన్నారు. బంద్ కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో మందులు అవసరమైతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 9951024789, 9603295502 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వద్నాల మహేందర్, గండు నరేష్, శ్రీనివాస్, వీరమల్లు, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు పెట్టడంలో యాజమాన్యం వైఫల్యం

### టిబిజికెఎస్ వ్యవస్థాపక కన్వీనర్ కెంగర్ల మల్లయ్య

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిని పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం నిటారుగా నిలబడి కార్మిక హక్కుల కోసం కొట్లాడడమే తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య లక్ష్యం అని (టీబీజీకేఎస్) వ్యవస్థాపక కన్వీనర్ కెంగర్ల మల్లయ్య అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లయ్య మాట్లాడుతూ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య సంఘాన్ని ఈనెల 4న మేడారం సమ్మక్క సన్నిధిలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇదే రోజు మే 4న బొగ్గు గని తవ్వకాలు జరిపిన రోజు అని అందుకే తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్యను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సంఘంలో పనిచేసే సభ్యులు రాజకీయంగా ఏ పార్టీతోనైనా అసోసియేట్ అయి ఉండొచ్చు కాని కార్మిక సమస్యలపై స్వతంత్రంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు సింగరేణి పరిస్థితి దయనీయంగా మారిందని, ఉత్తర తెలంగాణకి ఆర్థిక మణిహారంగా ఉన్న సింగరేణి ప్రైవేటీకరణ అంచున ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న డిపెండెంట్ ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. మెడికల్ బోర్డు నిర్వహించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం సింగరేణికి చెల్లించవలసిన బకాయిని చెల్లించకుండా సింగరేణి అప్పుల ఊబిలోకి నెట్టబడిందని, జీతాలకు సైతం బ్యాంకుల చుట్టూ తిరగవలసిన పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. సింగరేణిని దివాలా తీసి సింగరేణి ఖాయిల పడే పరిస్థితికి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రైవేటు పరం చేయుటకు కుట్ర జరుగుతుందని, కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా హరిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణిని రక్షించుకొని కార్మికుల పక్షాన కొట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా మా కార్యాచరణతో టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మంద సంపత్, లక్ష్మణ్, రాకేష్ రెడ్డి, అనిల్, సాంబయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## 24న డ్రాయింగ్, వ్యాసరచన, పాటల పోటీలు



ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్ : హనుమకొండ కు చెందిన ప్రముఖ చిత్రకారిణి స్థాపించిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ హెల్పింగ్ సొసైటీ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24 ఆదివారం పబ్లిక్ గార్డెన్ పక్కన ఉన్న టీటీడీ హాలు హనుమకొండ లో ఉదయం 10 గంటల నుండి డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, పాటల పోటీలు (దేశభక్తి గీతాలు) నినాదాల (దేశ నాయకుల స్లోగన్స్) పోటీలు, సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి ఒక ప్రకటనలో తెలిపారు. విభాగాల వారీగా పోటీ ఉంటుందని పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ఇస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కూడా ఉంటాయన్ని తెలిపారు. పిల్లల్లో దేశభక్తి పెంచేలా మేరా భారత్ మహాన్ అనే అంశం పైనే పోటీలు ఉంటాయని తెలిపారు... ఆసక్తి ఉన్నవారు 8143643337 నెంబర్ లో సంప్రదించవలన్నారు.

## నెక్కొండ తండాలో సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాపక్షం/నెక్కొండ : నెక్కొండ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సిఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులు బోడ అనితకు అందజేశారు. గ్రామ సర్పంచ్ బానోత్ రవికుమార్ అనుమతితో వార్డు సభ్యులు బోడ విజయ్ కుమార్, బోడ వెన్నెల దేవేందర్ కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామ పంచాయతీ కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అందదంలో ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి కృషి తోనే మంజూరు అయినదని ఇందుకు దొంతి మాధవరెడ్డికి రుణపడి ఉన్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు

ప్రజాపక్షం/నెక్కొండ : ప్రస్తుత వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగకరమైన పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి ఏ నాగరాజు తెలిపారు. నెక్కొండ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఈ విత్తనాలు రైతులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 30 కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ.4,905 కాగా, ప్రభుత్వం రూ.2452 సబ్సిడీ అందిస్తోందని, రైతులు కేవలం రూ.2452 చెల్లించి విత్తనాలను పొందవచ్చని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా విత్తనాలు పొందవచ్చన్నారు. వరి సాగుకు ముందు పచ్చి రొట్ట పంటను సాగు చేసి పూత దశకు రాకముందే నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని, చౌడు సమస్య తగ్గుతుందని, యూరియా వినియోగం తగ్గి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. అవకాశాన్ని మండల రై తులు సద్వినియోగం చేసుకోవాలని మం దల వ్యవసాయాధికారి ఏ నాగరాజు కోరారు.

## ధాన్యం కొనుగోలు చేసి అకౌంట్లో జమ చేయాలి



ప్రజాపక్షం/లింగాలఘణపురం : రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేసుకుని, రైతుల అకౌంట్లో డబ్బులను జమ చేయాలని, స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మాణిక్యపురం, గ్రామంలోని, ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు పడుతున్న ఇబ్బందులను వారు అడిగి ముచ్చటించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులు పండించిన వడ్లను, సక్రమ క్రమంలో కొనుగోలు చేసుకోకుండా, రైతులను, ఇబ్బందుల గురయ్యే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని వారు మండిపడ్డారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, వడ్లు కాంట అయిన తర్వాత, లారీలు రాక, వారాల కొద్ది కల్లాల కేంద్రాల్లో, వడ్లు నిలవడం, రైతులు ఇబ్బందులకు గురి అయితున్నారని, ప్రభుత్వ స్పందించి, వడ్లను తరలించేందుకు, లారీలను త్వరగా ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. రైతులపై నిర్లక్ష్య వహిస్తే, రైతుల పక్షాన, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని, రైతుల పక్షాన అండగా నిలుస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను వెంటనే తీర్చాలని వారు పేర్కొన్నారు. గత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య పాల్పడిన తిరుమలేష్ ఇంటికి వెళ్లి ఆయనను పలకరించి మనోధైర్యాన్ని తెలిపారు. రైతులు తొందరపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని అని వారు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్, చౌదరపల్లి శేఖర్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు ఏదునూరి వీరన్న, ఉడుగుల భాగ్యలక్ష్మి, బండ చంద్రమౌళి, ఎండి.అబీద్, పుట్టసిదులు, ధ్యాగల శివ కుమార్, సిహెచ్ చందు, చౌదరపల్లి పూర్ణచందర్, రోశయ్య, గణేష్ నవీన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తీవ్ర శ్వాస సమస్యతో వచ్చిన మహిళకు అత్యాధునిక గుండె చికిత్స




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, అలసట వంటి సమస్యలతో బాధపడుతున్న 38 ఏళ్ల మహిళకు వరంగల్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అత్యాధునిక గుండె చికిత్స ద్వారా కొత్త జీవం ప్రసాదించారు.సమగ్ర వైద్య పరీక్షల్లో ఆమె గుండెలో సుమారు 3 సెం.మీ పరిమాణంలో ఉన్న పెద్ద ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ (ఏఎస్డీ) — అంటే గుండెలో రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సమస్యకు ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఆధునిక ఏఎస్డీ డివైస్ క్లోజర్ విధానం ద్వారా విజయవంతంగా చికిత్స అందించారు. ఈ ప్రక్రియను వరంగల్ మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోదాని నేతృత్వంలోని కార్డియాలజీ బృందం విజయవంతంగా నిర్వహించింది. కాథెటర్ ఆధారిత సాంకేతికతతో ప్రత్యేక డివైస్‌ను గుండె వరకు తీసుకెళ్లి రంధ్రాన్ని శాశ్వతంగా మూసివేశారు. పెద్ద శస్త్రచికిత్స అవసరం లేకపోవడంతో రోగి వేగంగా కోలుకుంటున్నారని, వారం రోజుల్లోనే సాధారణ జీవితానికి తిరిగి చేరుకునే అవకాశముందని వైద్యులు తెలిపారు.వరంగల్ మెడికవర్ హాస్పిటల్‌లో ఇదే తొలి విజయవంతమైన ఏఎస్డీ డివైస్ క్లోజర్ కేసు కావడం విశేషమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ విజయంతో ప్రాంతీ య ప్రజలకు అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ సేవలను అందించడంలో మెడికవర్ హాస్పిటల్ మరో ముం దడుగు వేసిందన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ మోదాని మాట్లాడుతూ, "సరైన రోగులలో ఏఎస్డీ డివైస్ క్లో జర్ ఓపెన్ హార్ట్ సర్జరీకి ఉత్తమ ప్రత్యామ్నాయం. ఈ విధానంతో తక్కువ నొప్పి, తక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం, త్వరితగతిన కోలుకునే అవకాశం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయి" అని తెలిపారు.

## దరఖాస్తుదారులు ఇంటర్వ్యూకు హాజరవ్వాలి

### నడికూడ ఎంపీడీవో రామకృష్ణ



ప్రజాపక్షం/నడికూడ : ఈ నెల 20న ఉదయం 10:30 గంటలకు నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ పథకం ద్వారా రుణాలు పొందడానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క దరఖాస్తుదారులు మీ యొక్క దరఖాస్తు ఫారం,ఇతర సంబంధిత పేపర్లు తీసుకుని నడికూడ మండల ప్రజా పరిషత్ లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని నడికూడ ఎంపీడీఓ రామ కృష్ణ తెలిపారు.

## నేటి తరానికి ఆదర్శం పుచ్చలపల్లి సుందరయ్య

### సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : నిరాడంబర జీవితం, నిబద్ధత, త్యాగం, ప్రజల పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ... భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, నిరాడంబర జీవి, ప్రజల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు. సుందరయ్య కుల, మత, వర్గ భేదాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారు. తన పేరులో ఉన్న "రెడ్డి" అనే కుల సూచికను కూడా తొలగించుకొని సమానత్వ భావజాలానికి కట్టుబడి, సమాజంలో కుల వివక్ష లేకుండా అందరూ సమానులనే భావనతో ఆయన ఆచరణలో జీవించి చూపించారన్నారు. రైతాంగం, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమైనవని,తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన నాయకత్వం చరిత్రలో నిలిచిపోయిందని,నిరాడంబర జీవితం, నిబద్ధత, త్యాగం, ప్రజల పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శం అన్నారు. దేశంలో పెరుగుతున్న అసమానతలు, రైతుకార్మిక సమస్యలు, నిరుద్యోగం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని, అదే సుందరయ్య గారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న,జిల్లా నాయకులు జి.రాములు, ఓరుగంటి సాంబయ్య, రాజు, కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాపక్షం/లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల గ్రామంలోని గల, ఉపాధి హామీ కూలీలకు, వేసవి కాలంలో, పనిచేసే, ఉపాధి హామీ కూలీలకు, వడ దెబ్బ తగలకుండా, తగు సూచనలు నర్సింగ రామకృష్ణ ఉపాధి కూలీలకు వివరించారు. ఉపాధి హామీ కూలీలకు, ఎండ దెబ్బ నివారణకు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ వాడటం వల్ల, వడదెబ్బ నివారణకు 24 గంటల లోపు పనిచేస్తుందని వారు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు, ఏఎన్ఎం, సంపూర్ణ, ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, విలేజ్ డెవలప్ కమిటీ చైర్మన్, బత్తిని అశోక్ కుమార్ గౌడ్, కొత్తకొండ గంగాధర్, గొరిగే మధు, ఫీల్డ్ అసిస్టెంట్, నల్ల శ్రీనివాస్, కారోబార్ అజయ్, ఆశ వర్కర్లు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# జనగామ కలెక్టర్‌కు బాధితుల రక్షణ కమిటీ 12 ప్రశ్నలు

### సమస్యలు తీర్చకుంటే ప్రజల వైపున నిలబడతాం.. కలబడతామని హెచ్చరిక



ప్రజాపక్షం/జనగామ : జనగామ జిల్లా కలెక్టర్‌కు బాధితుల రక్షణ కమిటి 12 ప్రశ్నలు సంధించింది. ప్రజల గోడు వినాలని విజ్ఞప్తి చేసింది. సమస్యలు తీర్చకుంటే ప్రజల వైపునా నిలబడతాం..కలబడతామని హెచ్చరించింది. మంగళవారం జనగామలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ బాధితుల రక్షణ కమిటి కన్వీనర్ మహమ్మద్ సాధిక్ అలీ, కోకన్వీనర్లు కత్తుల రాజారెడ్డి, బూడిద గోపి మాట్లాడారు. జనగామ జిల్లా కలెక్టర్ వ్యక్తిగత కక్షలకు పోతున్నారని ఆరోపించారు. ఈ విషయమైన తాము ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపి, ఎమ్మెల్సీలకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి ప్రజలకు అందుబాటులో ఉంచారని జనగామ కలెక్టరేట్‌ను మాత్రం గడీల భవన్‌గా మార్చారన్నారు. ప్రజల వాహనాలు వెళ్లకుండా గేట్లు పెట్టి అడ్డుకుంటున్నారని వెంటనే వాహనాలను సెల్‌లార్ వరకు అనుమతి ఇవ్వాలని కోరారు. మహిళా శక్తి పథకంలో భాగంగా కలెక్టరేట్ ముందు తొలగించిన టీ స్టాల్‌ను అక్కడే ఏర్పాటు చేయాలని, వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న ధాన్యం 10 రోజుల్లోగా పూర్తిగా కొనుగోలు చేయాలని, ఇసుక, మట్టి రవాణా సమస్యను పరిష్కరిస్తూ ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సమస్య లేకుండా చూడాలన్నారు. ట్రాక్టర్లు, జెసిబిలకు వేస్తున్న జరిమానాలను తగ్గించాలని, గృహ నిర్మాణాలకు కావల్సిన ఇసుకను కలెక్టర్ భవన్ సమీపంలోనే అందుబాటులో ఉంచి విక్రయించాలని, అక్రిడేషన్ కమిటిలో ఇతర జిల్లాల వారిని తొలగించాలని, కత్తుల రాజిరెడ్డిపై తొమ్మిది కమిటీలు వేసి వేధించడాన్ని నిలిపివేయాలని, న్యాయ వ్యవస్థ ఉత్తర్వులను కించపరిచినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, మహిళా ఉద్యోగుల పట్ల కక్ష, ఉద్దేశపూర్వకంగా వ్యవహరించడం మానుకోవాలని, భూ భారతి చట్టం ప్రకారం ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా వ్యవహరించాలని, కలెక్టర్ కార్యాలయం లోపల గల క్యాంటీన్‌ను తిరిగి అదే స్థలంలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా పాలనాధికారిగా కలెక్టర్ అన్ని శాఖలపై అజమాషిషి కలిగి ఉంటూ సమన్వయంతో పనులు జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా రైతులు ఆత్మహత్యాయత్నానికి యత్నించడం, ధాన్యం తగలబెట్టడం, జాతీయ రహదారిపై ఆందోళన చేయడం, అధికారుల కాళ్లు మొక్కడం ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. జనగామ కలెక్టర్ బాగా పనిచేస్తే ఇన్ని సమస్యలు ఎందుకు వస్తున్నాయని, మెజార్టీ ప్రజలు ఎందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వ్యక్తిగత కక్షలకు పోతే తాము కోర్టుకు వెళ్తామని, వ్యక్తిగత కక్షలకు కాకుండా తాము సూచించిన 1 పనులు చేస్తే ఇంద్రుడు, చంద్రుడు అని కొలుస్తామన్నారు. కత్తుల రాజిరెడ్డి మాట్లాడుతూ తనకు రావల్సిన డబ్బుల కోసం కోర్టు మెట్లు ఎక్కగా కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన కలెక్టర్ తనపై తొమ్మిది కమిటీలు వేసి ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల 6న కోర్టులు మళ్లీ ఇయరింగ్ ఉందన్నారు. కలెక్టర్ కక్షసాధింపు చర్యలు సరియైనవి కావన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కలెక్టర్ బాధితుల రక్షణ కమిటి నాయకులు ఆకుల లక్ష్మయ్య, ధర్మభిక్షం, వనిత టీస్టాల్ యజమాని మంజుల, మంగళంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తులతో ఊరట కల్పించిన సర్పంచ్



**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలం లోని మర్లబడ తండ..కన్సోత్ తండా వెళ్లే మార్గంలో చెరువు మత్తడి వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ దారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారిన పరిస్థితిని గమనించిన చెరువు ముందడి తండా గ్రామ సర్పంచ్ కున్సోత్ మంగమ్మ శ్రీను నాయక్ వెంటనే స్పందించారు. మంగళవారం జేపీసి సహాయంతో రోడ్డు గుంతలను చదును చేయించి ప్రయాణానికి రైతులు, విద్యార్థులకు కొంత ఊరట వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి స్పం దించడం అభినందనీయమని గ్రామస్తులు సర్పంచ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన రైతు గాజుల వెంకటేశ్వర్లు ఐకెపి కొనుగోలు కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందిన ఘటన బాధాకరమని అఖిల భారత రైతు కూలీ సంఘం, తెలంగాణ రైతు కూలీ, తెలంగాణ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లు నాలుగు ఎకరాల్లో సాగు చేసిన వరి ధాన్యాన్ని ఐకెపి కేంద్రానికి తరలించినప్పటికీ 15 రోజులుగా కొనుగోలు జరగక తీవ్ర మనోవేదనకు గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అకాల వర్షాలకుకాం టాల్లో అవినీతి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకానికి ఉన్న వయో పరిమితిని ఎత్తివేయాలని కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఏఐకెఎంఎస్ నాయకులు రాచర్ల బాలరాజు, తెల ంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనరన్ సో మిడి శ్రీనివాస్, ఓదెల రాజయ్య, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ములుగు :** ములుగు మండలం కాసిందేవిపేట గ్రామానికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్, మహారాజు కృష్ణమూర్తిలు మురణించగా బాధిత కుటుంబాలను గ్రామ సర్పంచ్ వాండుకోత్ నిరోష అమర్ సింగ్ మంగళవారం సందర్శించి వారి కుటుంబానికి నివాళులు అర్పించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ మాజీ వైస్ ఎంపిపి స్వామిరావు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి గుండాల భాస్కర్, లియకత్ అలీ, అజారుద్దీన్, పార్టీ యూత్ అధ్యక్షులు ఎండి అసిమ్ అక్తర్, సుధాకర్, కుమారస్వామి, రామ్ నారాయణ, నర్సయ్య, స్వామిరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రహ్మణులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/ములుగు :** నాయి బ్రహ్మణులు ఆత్మగౌరవ పోరాటాలకు, హక్కుల సాధనకు సిద్ధం కావాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ నాయి బ్రహ్మణ సంఘం ములుగు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించగా జంపాల రవీందర్ ములుగు జిల్లాలో 9 మండలాలలో నూతన కమిటీలను నిర్మించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ మండల కమిటీల వారు నాయి బ్రహ్మణుల ఆత్మగౌరవం కోసం, హక్కుల సాధన కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సంఘాలకు ఆలోచన కలిచే విధంగా ములుగు జిల్లాలో కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాతాలలో కనీస కట్టుబాట్లు, ధరలు, నిర్ణయించుకునే పరిస్థితిలో కూడా సంఘాలను సిద్ధం చేయలేకపోవడం దుర్మార్గమైన పరిస్థితి అన్నారు. మన వృత్తిపైన మనకే హక్కు లేకుండా అధికారులు కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్న పోరాటాలకు సిద్ధం కాకపోతే ఇంకా ఎందుకు అన్నారు. ఇంకా అనేక సమస్యలపై పోరాటాలు చేయడానికి ములుగు జిల్లాలో ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మన ఐక్యతను దెబ్బతీయడానికి వివిధ పద్దతులలో, వివిధ రూపాలలో శత్రువులు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు. ఆ విషయాలను గమనించడానికి నాయి బ్రహ్మణులు సిద్దంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో మల్యాల రామచందర్, నడిగోటి మల్లయ్య, మద్దూరు రాములు, జంపాల ప్రభాకర్, చెన్న కుమార్, కురిమిళ్ళ సంపత్, మద్దురు రాజు, దడిగెల రాములు, దడిగల మహేందర్, జంపాల, ముక్కెర రాజశేఖర్, మొగిలిచర్ల రమేష్, చెన్న సాంబయ్య, బద్దెల సత్యనారాయణ, ఉద్యమారి సందీప్, దేవరకొండ మహేష్, దడిగెల రాజారామ్, శ్రీరాముల చంద్రశేఖర్, ముత్యాల విష్ణుదేవ్, జంపాల శ్రీనివాస్, ఎనగందుల కోటేష్, కొండయ్య, మురహరి రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. మంగళవారం ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఆయన చిత్రపటానికి సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని శ్రీరంగం రాధాకృష్ణల సౌజన్యంతో చేపట్టారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్ మాట్లాడుతూ భారతదేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పని చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో శ్రీరంగం రాధా రామకృష్ణ సౌజన్యంతో మంగళవారం సంతకు వచ్చిపోయే ప్రజలకు దప్పిక తీర్చేందుకు మధ్యాహ్నం సమయంలో చల్లని మజ్జిగను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ టౌన్ కార్యదర్శి జమ్ముల శ్రీను, యాకయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండి.అమీర్, వరలక్ష్మి, కొండ రాము, రేపూరి శ్రీను, సత్యం, మమత, షమీనా, భాగ్య, యాకలక్ష్మి, చెన్నమ్మ, ఐలమ్మ, దుండి కృప, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రామాంజనేయస్వామి దేవాలయంలో చైర్మన్ ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ నగరంలోని కాశిబుగ్గలో ఉన్న శ్రీ సీత రామాంజనేయస్వామి దేవాలయంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశాల మేరకు దేవాదాయ ఉప కమీషనర్ రామల సునీత ఉత్తర్వుల మేరకు దేవాలయ ఈఓ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ చైర్మన్, ధర్మకర్తలుగా దాసరి రాజేష్, వెలిశాల మధుమతి, పోతన లక్ష్మి నరసయ్య, కుడికాల కోటి, లకుం భాస్కర్, ఎస్ ఆఫీస్సయో సభ్యుడిగా పురోహితుడు, కాందూరి మధుచార్యలను ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ దాసరి రాజేష్, ధర్మకర్తలు మాట్లాడుతూ ఈ అవకాశం కలిపించిన కొండా సురేఖ మురళీధర్‌రావు, కొండా సుస్మిత పటేల్(చిట్టక్క), రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, వెలిశాల అన్దకుమార్, నీలం శ్రీనివాస్, సతీష్, విశాల్, శ్రీకాంత్, వినయ్, సుదర్శన్, కొండా అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, దేవాదాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కెటాయించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర జాటోతు బాలునాయక్, లంబాడ జేఏసీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ ధరావత్ జైసింగ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన మండల గిరిజన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బాలునాయక్, జైసింగ్ నాయక్‌లు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం, జాతిని జాగృతం చేసిన మహనీయుడైన సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని అటవీ ప్రాంతంలో కాకుండా హైదరాబాద్ నడి బొడ్డున ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జ్ఞాన మందిర నిర్మాణానికి వెయ్యి కోట్లు కెటాయించాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థి సంఘం, లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బంజారా నాయకులను రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. న్యాయబద్ధమైన అంశంపై శాంతియుత నిరసన చేయదలుచుకున్న గిరిజన నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమన్నారు. బంజారా నాయకుల డిమాండ్లను నెరవేర్చాలని, ప్రభుత్వం సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు.

## సేవాలాల్ దేవాలయ ప్రారంభంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలం అజ్మీరా మంగ్య తండాలో గిరిజనుల ఆరాధ్య ధైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, గిరిజనుల ఐక్యతకు ఆయన ఆశయాలు ఎంతో ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండలాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ హర్షణీయం



**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన, అనేక పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేయడం హర్షనీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఉద్యమకారుల ఫోరం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు ఆనాడు చేపట్టిన సకల జనుల సమ్మె, అనేక పోరాటాలు చేసి, ప్రాణ త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఆనాటి సీనియర్ ఉద్యమకారులను కె.కెశవరావు, ప్రొఫెసర్ కోదడంరామ్, పొన్నం ప్రభాకర్‌గౌడ్, అద్దంకి దయాకర్, రాములునాయక్‌తో కూడిన అధికారిక కమిటీని వేయడం అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా నిజమైన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, న్యాయవాదులు, కళాకారులు, జర్నలిస్టులను గుర్తించి ఉద్యోగాలు, పెన్షన్లు, ఇంటి స్థలాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు అనపురం వెంకన్న గౌడ్, బొరిశెట్టి అల్లాబాబు, కొండ వెంకన్న, వాసిరెడ్డి నర్సింహారెడ్డి, కొదునూరి సధాకర్, వేల్పుల వెంకన్న, పంజాల బుచ్చిరాములు, ప్రతాపని లక్ష్మయ్య, గాదగాని రమేశ్, దామోదర్, విద్యాసాగర్, ఎల్లారెడ్డి, సుధాకర్, వెంకటయ్య, అశోక్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే వరంగల్ జిల్లా నల్లబెల్లి సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ మండలంలోని గ్రా Zమ పంచాయితిలలో పని చేస్తున్న సిబ్బందికి 9 వేల 500 రూపాయల వేతనం సరి పోక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కొన్ని గ్రామ పంచాయిలలో పని చేస్తున్న సిబ్బందికి అన్లైన్ కార్మికులకు ఇవ్వలసిన 9 వేల 500లకు 7 వేల వరకే జీతాలు ఇస్తున్నట్లు సిబ్బంది అరోపనలు చేస్తున్నారని చెప్పారు . కార్మికులకు 9 వేల 500 రూపాయలు పాలక వర్గాలు ఇచ్చే విధంగా పంచాయితి కార్యదర్శులకు విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మామిండ్ల అయిలయ్య ,ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు పరికి రత్నం తదితరులు పాల్గోన్నారు .

## సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు

**ప్రజాపక్షం /జనగామ :**పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు చేస్తామని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ జరిగింది. రైల్వే స్టేషన్ వద్ద జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మోకు కనాకరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య కుల వివక్షకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టినా తన పూర్వికుల నుండి వచ్చిన భూమిని పేదలకు పంచాడన్నారు. సుందర్‌రాంరెడ్డి పేరును సుందరయ్యగా మార్చుకున్న మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఉత్తమ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. కులం, మతం మధ్య చిచ్చులు పెడుతూ ప్రజల్ని విభజించే పాలించేవారన్నారు. దేశంలో ఉన్న పిల్లలంతా తన పిల్లలని భావించిన గొప్ప మానవతావాధి సుందరయ్య అని కొనియాడారు. ఆయన సూర్తిగా జిల్లాలో ప్రజాపోరాటాలు నిర్వయింస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, బోడ నరేందర్, పొత్కనూరి ఉపేందర్, ఎండి అజారుద్దీన్, బాల్నె వెంకటమల్లయ్య, పల్లెల లలిత, మంగ బీరయ్య, బూడిద ప్రశాంత్, రమావత్ మీట్యానాయక్, గాడి శివ పల్లెర్ల శంకర్, వెంకటేశ్ బిట్ల లక్ష్మి పాల్గొన్నారు.

## గంగపుత్రులను అధికారికంగా గుర్తించాలి

బీసీఏలో ముదిరాజులను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నాం

పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ



**ప్రజాపక్షం/నర్సంపేట :** గంగపుత్రులను అధికారికంగా గుర్తించి, బీసీఏలో ముదిరాజులను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ అన్నారు. పట్టణంలోని గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ ఆధ్వర్యంలో గంగ పుత్రులు ఆర్డిఓను కలిసి వినతి పత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గుంటి సంజీవ మాట్లాడుతూ బెస్త, గంగపుత్ర కులస్తులను ఈమధ్య ప్రకటించిన సమగ్ర సర్వేలో ప్రభుత్వం జనాభా లెక్కల్లో చూపెట్టలేదని, ఉపకులాలుగా చూపెట్టడం జరిగిందని అన్నారు. బెస్త గంగపుత్రం కులాలు, ఉప కులాలు కాదని గుర్తు చేశారు. గంగపుత్రులేని సమాజాన్ని ఊహించుకోలేమని, గంగపుత్రులం చేపలు పట్టుకొని జీవించే వారమని, అనాదిగా మాది ఇదే వృత్తి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బెస్త, గంగపుత్ర కులాలను అధికారికంగా ప్రకటించాలని కోరారు. తెలంగాణలో ఐదు ఆరు లక్షల జనాభా ఉన్న గంగపుత్రులను చూపెట్టకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అదే విధంగా బీసీడీలో ఉన్న ముదిరాజులను బిసిఏ లో కలపడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను వ్యతిరేకించారు. సంపన్న వర్గానికి చెందిన ముదిరాజులు బీసీఏలోకి వస్తే బీసీ ఏ లో ఉన్న 57 కులాలు వారి ప్రాతినిధ్యం కోల్పోతారని ఉనికి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బీసీఏ లో ఉన్న కులాలకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదరణ లేకుండా వెనుకబడి ఉన్నామని, మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు, ప్రభుత్వం తన నిర్ణయం వెనక్కి తీసుకోబోకపోతే బీసీ ఏ కులాలు భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎర్రబోయిన కిషన్, జిజుల సాగర్, చింతల టార్జాన్,అంకాల మల్లికార్జున్, అంకాల సురేష్, పూస ఏకాంబరం, మేదరబోయిన శ్రీనివాస్, కాపర బోయిన రమేష్,గుంటి శ్రీనివాస్, అంబటి సంజీవ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/రాయపర్తి :** తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు ఎనగందుల శ్యామ్ సుందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఎన్నికలలో ఓటమి చవి చూసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికలలో మ్యానిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల 250 చదరపు గజముల ఇంటి స్థలాన్ని, జార్ఖండ్ తరహాలో రూ.25వేల పెన్షన్ ఇస్తామని ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులను ఇస్తూ వారి జీవన భృతికై 10 కోట్ల రూపాయలతో నిధులు ఏర్పరుస్తామని తెలిపారన్నారు. అట్టి హామీల ద్వారా ఎన్నికైన ఈ ప్రభుత్వం సుమారు రెండున్నర సంవత్సరాల తదుపరి ఉద్యమకారులు గుర్తించడానికి మొట్టమొదటిగా కేకే కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారి హామీలను పరిపూర్ణంగా అమలు చేయాలని అన్నారు. కేకే కమిటీలో పొందుపరిచిన నాలుగు అంశాలతో పాటుగా ఉద్యమకారుల బైండోవర్ కేసులు ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిని ఆర్థికగా దెబ్బతిని చితికిపోయిన వారికి, సకల జనుల సమ్మె వంటా వార్ప రాస్తారోకోలు దీక్షా శిభిరాలను ధూమ్ ధాం ద్వారా ఎన్నో రకాల పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ ఈ రోజు అమరులైన వారిని కాక ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సహకారం అందజేసే దిశగా కమిటీ చర్యలు తీసుకోవాలని తద్వారా అతి తొందరగా ఉద్యమకారులకు మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అపావతు పంతులు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు సుదగాని వెంకటేశ్వర్లు, మండల బాధ్యులు ప్రధాన కార్యదర్శి నాగండ్ల భాస్కర్, మండల కమిటీ సభ్యులు మునావత్ సేవాలాల్, దురిశెట్టి కొమురయ్య, జక్కుల వెంకన్న, మునావత్ లక్ష్మ ణ్ నాయక్, చిన్నాల యాకయ్య, సంక్రాంతి పరమేశ్వర్, సుధగాని నరసయ్య, నాగండ్ల శీను, పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగిస్తే ఉద్యమమే



**ప్రజాపక్షం/కొడకండ్ల:** గ్రామ పంచాయితీలలో ఉప సర్పంచ్‌లకు ఉన్న ఉమ్మడి చెక్ పవర్‌ను తొలగించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని కొడకండ్ల మండల ఉప సర్పంచ్‌ల ఫోరం ప్ర భుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించింది. మంగళవారం మండల కేంద్రంలో ఉప సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు స్థానిక ఎంపీడీవోను క లిసి ఈ మేరకు ఒక ఘాటు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కొందరు సర్పంచ్‌లు, పంచాయితి కార్యదర్శులు కుమ్మక్కై గ్రామ నిధులను దోచుకోగా అవినీతి ని అడ్డుకట్ట వేసేందుకే అప్పటి ప్రభుత్వం ఉప సర్పంచ్‌లకు చెక్ ప వర్ కల్పించిందని గుర్తు చేశారు. ఇపుడు మళ్లీ ఆ హక్కును కాలరాయాలని చూడడం అంటే గ్రామాలలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చే యడమే కాకుండా పాత అవినీతి రాజ్యాంగానికి మళ్లీ తలుపులు బార్లా తెరవడమేనని ఫోరం ప్రతినిధులు మండిపడ్డారు. ఈ ప్రమాదకరమైన ఆలోచనలను పక్క పెట్టి ఉప సర్పంచ్‌ల గౌరవాన్ని అధికారాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు మహ్మద్ షన్న, వెంకటయ్య, రంగయ్య, యాకూబ్ పాషా, శ్రీనివాస్, రెహమాన్, పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

ఎఐసిటియు జిల్లా ప్రధాన ముక్కెర రామస్వామి




**ప్రజాపక్షం /వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐసిటీయు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐసిటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంట్టర్లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐసిటియు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, అధ్యక్షులు సుంచు జగదీశ్వర్ లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ధరలు పెంచమని ఐదు రాష్ట్రాల ఎన్నికలలో నరేంద్ర మోడీ వాగ్దానం చేశారని, ఎన్నికల తర్వాత డీజిల్, పెట్రోల్ , గ్యాస్ ధరలను పెంచి కార్మిక పేద మధ్య తరగతి ప్రజలపై మోయలేని భరాలను మోపారన్నారు. పెంచిన ధరలు పెట్టుబడుదారులకు ఆదానీ, అంబానీ కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడం కోసం పేదల కడుపులు గొట్టి పెద్దల కడుపులు నిప్పే ప్రభుత్వం ప్రయత్నం చేసిందని, ఇప్పటికైనా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనియెడల రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని .
ఈ కార్యక్రమంలో ఏఐసీటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మహబూబ్బాషా, రైతు సంగం నాయకులు అయితం నగేష్, దామెర శివ, ఎస్‌డి సలీం బాబా, దామెర రమేష్, ప్రభాకర్, ఎండి గౌస్, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.
ఫోటో రైటప్

## పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



**ప్రజాపక్షం / నర్సంపేట :** పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భుక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి, 10 వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు, కులవ్యవస్థను నిరసించిన సుందరయ్య అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి లోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్నాడని కొనియాడారు. సహచరులు పుచ్చలపల్లి సుందర కామ్రేడ్ పి.ఎస్. అని పిలిచే వారన్నారు. చివరి శ్వాస వరకు అను నిత్యం పేదప్రజల కోసం పోరాడిన సుందరయ్య పోరాట స్ఫూర్తిని పునికిపుచ్చుకొని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, పట్టణ కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, ఎండీ ఫరీదా, వజ్జంతి విజయ, బుర్రీ ఆంజనేయులు, లక్క రాజు, రుద్రారపు లక్ష్మి , ఉదయగిరి సరిత, గణిపాక విలియం కేరి , మోగులోజు శారదా, దాసరి నరేష్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

## పిట్లం మండల వ్యాప్తంగా జనగణన



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండల వ్యాప్తంగా జనగణన ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ మహేంధర్ మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పక్కా ప్రణాళికతో ఇల్లిళ్ళు తిరిగి ప్రజల వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలు మీ వద్దకు వచ్చే సిబ్బందికి పూర్తి వివరాలు తెలియజేసి సహకరించాలని తహసీల్దార్ సూచించారు. నిర్ణీత గడువులోపు వంద శాతం జనగణన ప్రక్రియ పూర్తిచేస్తామని సిబ్బంది తహసీల్దార్‌తో పేర్కొన్నారు.

## గడువులోగా ధాన్యం కొనుగోళ్ళు పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/పిట్లం:** జిల్లా అధికారులు కేటాయించిన గడువులోపే ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని పిట్లం తహసీల్దార్ మహేంధర్ అన్నారు. ఆయన మంగళవారం పిట్లం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నిల్వలను, తూకం చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్ళు జరపాలని అధికారులను తహసీల్దార్ ఆదేశించారు.

## సింగరేణి మనుగడకు సమష్టి కృషి అవసరం

### జిఎం శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత సాధనకు ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఆర్పీ3, ఎస్ఆర్పీ1 భూగర్భ గనుల్లో నిర్వహించిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పోటీ మార్కెట్ పరిస్థితుల్లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది లక్ష్య సాధనలో సంస్థ 74 శాతం మాత్రమే చేరుకుందని, అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు తొలి నెలలో 100 శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. సమావేశాల్లో ఉత్పత్తి, యంత్రాల వినియోగం, ఆర్థిక పరిస్థితులు, నాణ్యత, భద్రత, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బుధవారం ఆర్కే5, ఆర్కేఎన్‌టీ గనుల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశాల్లో సింగరేణి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సాంకేతిక పోటీలలో ‘బివిఆర్ఐటి’ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ సమీపంలోని బి.వి.ఆర్ఐటి విద్యార్థులు బెంగుళూరు లో నిర్వహించబడిన జాతీయ స్థాయి సాంకేతిక పోటీలలో బి విఆర్ఐ టి విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆర్మ్ భారత్ ఏఐ చాలెంజ్ పోటీలలో బివిఆర్ఐటి విద్యార్థులు ప్రథమ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీల్లో సమస్యా విభాగం5వ కేటగిరీలో కళాశాలకు చెందిన అడ్ ఆస్ట్రా జట్టు విజేతలుగా నిలిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ ప్రాజెక్ కు కళాశాల అధ్యాపకులు డా॥ యు.జ్ఞానేశ్వర చారి మార్గదర్శకత్వంలో ఆయన పర్యవేక్షణలో బీవీఆర్ఐటీకి చెందిన మూడవ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు చేరాల రోహన్ కుమార్, కార్తీక్ పాకాల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న ప్రాజెక్ట్ను రూపొందించారు. రియల్ టైమ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్ యూజింగ్ హార్డ్వేర్ యాక్సిలరేటెడ్ సి.ఎన్.ఎన్ ఆన్ జైలింక్స్ జింక్ ఎఫ్పీజీఏ విత్ ఆర్మ్ ప్రాసెసర్ అనే అంశంపై రూపొందించిన ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో విశేష ప్రశంసలు అందుకుంది. జైలింక్స్ జింక్ ఎస్‌పిజిఏ మరియు ఆర్మ్ ప్రాసెసర్ల సహాయంతో రియల్‌టైమ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్‌ను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాన్ని విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఎడ్జ్ ఏఐ మరియు ఎంబెడెడ్ సిస్టమ్స్ రంగాల్లో ఈ ప్రాజెక్ట్ ఒక వినూత్న సాంకేతిక పరిష్కారంగా నిలిచిందని తెలిపారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ శ్రీ కె.వి.విష్ణురాజు మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న మంచి లాబ్స్ సౌకర్యాలు ఉండటం వలన ఇటువంటి ప్రతిభ విద్యార్థులనుండి దేశవ్యాప్తంగా విస్తరంచబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కార్యదర్శి ఆదిత్య విశ్వం విద్యార్థులను అభినందించారు. అదే విధం గా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సంజయ్ దూబే, కళాశాల డైరెక్టర్ డా॥ లక్ష్మీ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి డా॥ సంజీవ్ రెడ్డి, కళాశాల మేనేజర్ బి.బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టిఎల్ఎన్ సురేష్ విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయిలో కళాశాల ప్రతిష్టను మరింతగా పెంచిన ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా విద్యార్థులు పరిశోధన మరియు ఆవిష్కరణల దిశ గా మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించా రు.




## అల్లాదుర్గంలో భారీ వర్షం, విరిగిపడిన ఇంటి పైకప్పు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అకాల వర్షాలు, ఈదురు గాలులతో మండలంలోని పలు గ్రామాలలో పంట, ఆస్తి నష్టం సంభవించాయి, ఉదయం నుండి ఎండ తీవ్రత ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం జోరు అందుకోవడంతో పలుచోట్ల చెట్లకుమ్మలు విరిగిపడి వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కేంద్రమైన అల్లాదుర్గంలోని సబ్ స్టేషన్ వద్ద వైఫై టవర్ వర్షానికి , ఈదురు గాలులకు ఎగిరి పడింది. పలు గ్రామాలలో వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే మామిడి, తదితర పంటలకు ఈ వర్షం అపార నష్టం కలిగించింది. వర్షాలకు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు. మండల పరిధిలోని బహిరిన్ దిబ్బ గ్రామంలో గాలివానకు నడి పుల్ల హనుమంతు ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ఎగిరిపోయి ఇంట్లో నిత్యవసర సరుకులు, వస్తువులు పూర్తిగా తడిసిపోవడంతో గ్రామ సర్పంచ్ వీరప్ప సొంతంగా నిత్యవసర సరుకులు అందజేశారు.

## వేగంగా ధాన్యం కొనుగోళ్లు

### 26,191 మంది రైతులకు రూ.260 కోట్లు జమ

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో గతం కంటే అత్యంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఎలాంటి అక్రమాలు లేకుండా పారదర్శకంగా రైతుల నుంచి మంగళవారం వరకు 1,85,688,480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 37,072 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి 26,191 మంది రైతులకు 260.03 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగిందని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత స్పీడ్ అప్ చేసి, అకాల వర్షాల నుండి కాపాడడానికి టర్పాలీను కవర్లను అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపట్టాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ హెచ్చరించారు.

**ఎక్కువ తూకం వేస్తే చర్యలు తప్పవు**

**రేగోడు:** మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రలోని పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ సందర్శించి కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేలా చూడాలని అన్నారు. లోడింగ్ అన్ లోడింగ్ త్వరగా అయ్యేలా చూడాలి మిల్లుల దగ్గర ఆలస్యం కావద్దని ప్రతి కేంద్రాన్ని ఆధికారులు నిరంతరం సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ దత్తు రెడ్డి ఎంపిడిఒ సీతారామ్, ఎస్సై పోచయ్య, తదితరులు పాల్గొన్నారు

## హవేలి ఘనపూర్ మండల అధ్యక్షుడిగా కిరణ్ గౌడ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ముత్తాయి కోట గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, న్యాయవాది గుండారం కిరణ్ గౌడ్ నియామకం అయ్యారు. మంగళవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ లు మెదక్ జిల్లాలోని మండలాల అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే హవేలి ఘనపూర్ మండలానికి కిరణ్ గౌడ్‌ను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో హవేలి ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు కార్యకర్తలకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మండలం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆర్.వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బండారి మహేందర్‌రెడ్డిని నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షుడిని మంగళవారం మండల సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా చేపడుతానని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతానని అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సన్మానించిన వారిలో సర్పంచ్‌లు సునీల్, రామకిష్టయ్యతో పాటు పార్టీ నాయకులు కొత్త రాజేందర్‌గుప్తా, ప్రశాంత్, శ్రీకాంత్ సాగర్, శివ, సంజీవరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ అన్నారు. మండల కేంద్రమైన మనోహరాబాద్ రైతువేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పంటల సాగు మెలకువలను ఏ విధంగా ఉపయోగించాలో వీడియో స్క్రీన్ ద్వారా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈవోలు సచిన్, నరేందర్ గౌడ్, స్థానిక రైతులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇండ్ల గణన ప్రక్రియ

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/రేగోడు:** మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రలో మంగళవారం కోత్వాల్ పల్లి ఇండ్ల గణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఎన్యూమారేటర్లనుతో మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే సక్రమంగా చేపట్టాలని ఎన్యూమారేటర్లకు సూచించారు. నిబంధల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రజలు ఎన్యూమారేటర్లకు సహకరించాలని కోరారు. అందరి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ దత్తురెడ్డి, ఎస్సై పోచయ్య, ఎన్యూమారేటర్లు అంజి బాబు తదితరులు పాల్గొన్నారు

## పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ సుందరయ్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. సుందరయ్య 41వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విప్లవోద్యమ యోధుడు, మహానేత సుందరయ్య చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోమసత్యం, మదార్, సోమ అశోక్, మల్లేష్, నర్సయ్య, రమేష్, రాజు, బొడియ నాయక్, రాజేష్, రమేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

# కో-ఆప్షన్ ఎన్నికల్లో పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యే పటేల్

## ఎన్నికైన ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు బిజెపి మద్దతుదారులే



**ప్రజాపక్షం / భైంసా :** భైంసా మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంతం నెగ్గించుకున్నారు. మొదట్లో జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో బిజెపి కౌన్సిలర్‌ను తప్పుదోవ పట్టించడంతో అప్పట్లో ఎన్నిక రసబాసాగా మారి ఎన్నిక వాయిదా పడగా, మంగళవారం జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో మూడు స్థానాలకు ఎన్నికలు జరగగగా మూడు కోఆప్షన్ పదవులు మున్సిపల్ చైర్మెన్ మద్దతుదారులు దక్కించుకున్నారు. దీంతో నాలుగు కోఆప్షన్స్ స్థానాల్లో మూడు బిజెపి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్నిక ప్రారంభం కావడంతో ఆరుగురు బిజెపి కౌన్సిలర్లు ఏడుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యేపవార్ రామారావు పటేల్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లు గైర్హాజరవడంతో కోఆప్షన్ ఎన్నిక ఏకపక్షం అయింది. అనుకున్న స్థానాలు లేకపోయినప్పటికీ ఎంఐఎం పార్టీ కోఆప్షన్ మెంబర్లను దక్కించుకోవడానికి ఎత్తులు వేయడం, పలు ఆరోపణలు చేసినప్పటికీ ఎమ్మెల్యే పటేల్ ముందు ఏలాంటి పాచికలు పారలేదు. మున్సిపల్ చైర్మెన్ దత్తాత్రి నేతృత్వంలో కౌన్సిలర్‌లు హైకోర్టుకు వెళ్ళగా ఎన్నిక జరిగింది.

### ముగ్గురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా తోట లింగురాం, ముజీబ్ అహ్మద్, అల్లకొండ కవిత ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు తోట లింగురాం, ముజీబ్ హైమద్‌లు గతంలో మున్సిపల్‌వైస్ చైర్మెన్‌లుగా పదవులు చేపట్టిన వారే, అల్లకొండ కవిత గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. వీరికి నియామక పత్రాలను సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మెన్ తూమొల్ల దత్తాత్రి కమీషనర్ లింగయ్య నియామక పత్రాలను అందజేశారు.

### మున్సిపల్ కార్యాలయం ముందు మిన్నంటిన సంబురాలు

కోఆప్షన్ ఎన్నికల్లో బిజేపి మద్దతుదారులు ముగ్గురు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కావడంతో మున్సిపల్ కార్యాలయం ముందు సంబరాలు మిన్నంటాయి. బిజేపి నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మెన్ అభిమానులు, టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. హిందూ ముస్లీం భాయ్, బాయ్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

### అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకు-నేది లేదు, జాబీర్ హైమద్‌ను హెచ్చరిం-చిన మున్సిపల్ చైర్మెన్

తమ నేత ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మెన్ తూమొల్ల దత్తాత్రి మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ హైమద్‌ను హెచ్చరించారు. కోఆప్షన్ ఎన్నిక ముగిసిన అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు. మరో మారు ఇలాంటి ఆరోపణలు చేస్తే తగిన రీతిలో సమాదానం చెబుతామన్నారు. గతంలో తప్పుదోవ పట్టించి ఎంఐఎం పార్టీ ఒక కోఆప్షన్ స్థానాన్ని దక్కించుకున్న విషయంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

# కల్లుగీత కార్మిక కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ శేఖర్‌గౌడ్‌ను సన్మానించిన ఆలయ కమిటీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మోపాల్ మండలం బోర్గాం గ్రామంలోని సంజీవరెడ్డినగర్ కాలనీలోని శ్రీ లవకుశ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కల్లు గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శేఖర్‌గౌడ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌమ్యుడు, అందరికి అందుబాటులో ఉండే శేఖర్‌గౌడ్‌కు చైర్మన్ పదవి రావటం ఆయన కష్టఫలమన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, నర్సారెడ్డి, సాయిరెడ్డి, అజిత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి



**ప్రజాపక్షం/బాల్కొండ :** ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏప్రిల్ 30 నుండి మే 26 వరకు నిర్వహిస్తున్నట్లు రుద్రూర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్త, డాక్టర్ జి.రాకేష్ తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంతో రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చి ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చని, ధీర్ఘకాలంలో ఇది సుస్థిరమైన లాభదాయకమైన వ్యవసాయ విధానం, రైతులు క్రమంగా రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతులను అవలంభించడం ఉత్తమమన్నారు. సాగునీటిని సమర్థవంతంగా వినియోగించడం అత్యంత అవసరం, నీటి వనరులు రోజురోజుకు తగ్గుతున్న నేపథ్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను అవలంభించటంతో నీటిని ఆదా చేయవచ్చన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి వనరులను సంరక్షించడంలో సహాయపడుతుందన్నారు.లావణ్య, వినాయక్, సర్పంచ్ భూమేశ్వర్, సూరజ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ఆకాశాన్ని అంటిన ఎండు మిర్చి ధర

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఆదివారం సంతలో వచ్చిన ఎండుమిర్చి ధర ఆకాశాన్ని అంటడంతో కొనలేమంటున్న వినియోగదారులు గత ఆదివారం నుంచి ఇప్పటి వరకు మోర్తాడ్ మార్కెట్ కు వస్తున్న ఎండుమిర్చి ధర కిలో 240 రూపాయాల నుంచి 350 రూపాయల వరకు కిలో మిర్చి ధర పలుకుతుంది. దీంతో ప్రజలు ఎండుమిర్చి కొనే పరిస్థితిలో లేమని అంటున్నారు. ఇంత ధర అని మార్కెట్‌లో మిర్చి వ్యాపారస్తులను ప్రజాపక్షం పలకరించి వివరాలు అడుగగా మిర్చికి ఎన్నో రకాల చీడపీడలు వస్తున్నాయని, దీంతో మిర్చి పంట పండించే రైతులు పంటను కాపాడేందుకు ఎన్నో రకాల చీడపీడలు వస్తున్నాయని, దీంతో మిర్చి పంట పండించే రైతులు పంటను కాపాడేందుకు ఎన్నో రకాల పురుగు మందులు వేయాల్సి ఉంటుందని, అయినప్పటికీ కొంత పంట నష్టం వాటిల్లుతుందని, అయినా సరే పంటను దక్కించుకోవాలన్నా రైతులు పంటపై ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, దీంతో మార్కెట్‌కు తీసుకవచ్చే సరికి మేము ఈ రేట్ల చొప్పున అమ్మవాల్సి వస్తుందని వ్యాపారస్తులు పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమిర్చికి ఎంత పెట్టుబడి పెట్టైనా మిర్చి కొనవలసి వస్తుందని స్థానిక వినియోగదారులు తెలిపారు. ఏదిఏమైనా మార్కెట్లలో ధరలు నియంత్రిస్తే బాగుంటుందని వారు అంటున్నారు.

# ఇందిరమ్మ వరమిచ్చింది

## కరెంట్ తీగెలు శాపమైంది

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే సామెతను నిజం చేస్తున్నారు విద్యుత్ శాఖ అధికారులు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం వరమిస్తే ఇంటిపైన ఉన్న విద్యుత్ తీగెలు తొలగించకుండా అధికారులు శాపంగా మారారు. మండలంలోని చేపూర్ గ్రామంలో ఓ నిరుపేద కుటుంబం సంవత్సరం నుంచికన్నీటి వ్యథ అనుభవిస్తోంది. స్వంతింటి కలతో పడరాని పాట్లు పడుతోంది ఆ గ్రామానికి చెందిన రాయల లక్ష్మి కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు ఇల్లు మంజూరైందని ఆ కుటుంబం ఎంతో సంబరపడ్డారు. వెంటనే లక్షల రూపాయలు అప్పు చేసి ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఇంటిపైనే విద్యుత్ తీగెలు మృత్యు కుహరంలా నిలిచాయి. ఇల్లు మంజూరైన వెంటనే కరెంట్ తీగెలు తొలగించాలని ఏడీ డీఈ, ఎస్ఈల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్న షిఫ్టింగ్‌కు రూ.81 వేలు డీడీ కట్టాలన్నారని బాధితురాలు రాయల లక్ష్మి కన్నీటితో చెప్పారు. నిరుపేద కుటుంబానికి రూ. 81 వేలు కట్టే స్థోమత ఉంటే ఆమె ఇందిరమ్మ ఇల్లుకు ఎందుకు ఎదురు చూస్తానన్నారు. ఇప్పుడు ఇంటి నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. ఇంటిపైన విద్యుత్ తీగలుండటంతో స్లాబ్ పనులు చేయలేకపోతున్నామని వాపోయారు. మళ్లీ అధికారులను అడిగితే రూ.81 వేలు కన్జ్యూమర్ అన్న కట్టాలి లేదంటే ప్రభుత్వమన్న పే చేయాలి అప్పుడే ఆ తీగలు తీసేస్తామని అధికారులు ఆమెతో చెప్పరని ఆమె వాపోయారు. అప్పు చేసి ఇల్లు కడుతున్నాం. ప్రభుత్వం సహృదయంతో ఇల్లు ఇస్తే అధికారులు మాత్రం మా బాధను పెడచెవినా పెడుతున్నారని బోరున విలపించారు.

# ఆదివాసి నాయకపోడ్ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సన్మానం

## జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ పరిధిలోని పెర్కిట్ గ్రామ శివారులోని మంగళవారం భీమన్న కళ్యాణ మండపంలో ఆదివాసి నాయకపోడ్ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు పుట్ట రాజేశ్వర్ అధ్యోత వహించారు. కార్యక్రమంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ఉన్నత చదువులో (ఎంబిబిఎస్, ఫిజియోథెరపీ, ఎల్ఎల్‌బి) ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు 100 మంది విద్యార్థులను మెమోంటోలతో అదనపు కలెక్టర దిలీప్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించటానికి ఇలాంటి ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించటం చాలా శుభపరిణామం. ప్రతిభ కనబర్చిన విద్యార్థుల స్వంత ఖర్చులతో నగదు బహుమతులను అందజేశామన్నారు. ఈ ఉత్సవంలో నిర్మల్, మంచిర్యాల్, ఆదిలాబాద్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు, ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నిఘా వ్యవస్థ పటిష్ఠ పరచాలి

## పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నిఘా వ్యవస్థ పటిష్ఠ పరచాలని, ప్రతిస్టేషన్‌లో అమలవుతున్న 5 ఎస్ విధానం అమలు పరిచేలా ఎస్‌హెచ్‌వోలు చూడాలని పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని టౌన్ 5 పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీసు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం అందించగా, వందనాన్ని స్వీకరించి అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీసు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆయా ప్రాంతాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.శ్రీనివాస్, సిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ అంజయ్య, టౌన్ 5 ఎస్ఐ ఎం. గంగాధర్, ఎస్ఐ 2 ఆర్.లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు మూడు రూపాయాల చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సామాన్య ప్రజల పైన పెను భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధి లేక పేద ప్రజలు అర్ధాకలితో అలమటిస్తుంటే, ఇంధన ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ధరలు పెరిగాయని చెప్పడం సాకు మాత్రమేనని ఈ పెరుగుదల కేవలం అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు మేలు చేయడానికే అని అన్నారు. నక్కపై తాటికాయ పడ్డట్లు తయారైందన్నారు. ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.